క్లుప్తంగా

ఖేడ్ ఆర్డీఓ బదిలీ

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్డీఓ నలవాల వెంకటేష్ హన్మకొండ ఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కల్లూరులో విధులు నిర్వహిస్తున్న అశోక చక్రవర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాసనసభ ఎన్నికలకు ముందు ధర్మపురి తహసీల్దార్‌గా పని చేస్తూ పదోన్నతిపై నలవాల వెంకటేష్ నారాయణఖేడ్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఆయనను హన్మకొండ ఆర్డీఓగా బదిలీ చేస్తూ ఖేడ్ ఆర్డీవోగా అశోక చక్రవర్తిని నియమించారు.

సూరారం చెరువు తూముకు మరమ్మతులు చేపట్టండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని సూరారం చెరువు తూముకు మరమ్మతులు రిపేర్ చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. వ్యకాస మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సూరారం చెరువు తూము కాలువలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. తూము చెడిపోయి 20 రోజులైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీంతో నీళ్లు వృథాగా వెళ్తున్నాయన్నారు. తూముకు మరమ్మతులు చేపట్టకపోతే ఆయకట్టు కింద ఉన్న వరిపొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఏషోబు, రైతు సంఘం మండల కార్యదర్శి భూషణం, రైతులు లింగం, మొగులయ్య పాల్గొన్నారు.

వశిష్ట డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఆట పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దారెడ్డి బుధవారం ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారంబోర్డు, క్విజ్ అంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి ఈ నెల 29న బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు అమర్‌నాథ్, సంజీవ్‌రావు, అధ్యాపకులు శ్రీనివాస్, కృష్ణ, శ్రీకాంత్, సంగన్న, శిల్ప, భార్గవి, సంగీత, పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి విగ్రహావిష్కరణ

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఖేడ్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తొలి అమరవీరుడైన శ్రీకాంతాచారి విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, ఓబీసీ జాతీయ కమిషన్ సభ్యులు తల్లోజి ఆచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాంతాచారి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, విశ్వకర్మ సంఘ రాష్ట్ర నాయకులు కవలే జగన్నాథం, జైస్‌కుమార్, సంఘం బాధ్యులు బీబీపేట రవి, సత్యంచారి, విశ్వకర్మలు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన నాయకులతో నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల ఇస్మాయిల్‌ఖాన్ పేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి బుధవారం సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నుంచి 50మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరాం, దుల్యానాయక్, రాములు, మోహన్‌రావు, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

లక్ష్యం చేరాలంటే క్రమశిక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఫర్వీన్ షేక్

హత్నూర(సంగారెడ్డి): అనుకున్న లక్ష్యం చేరాలంటే క్రమశిక్షణ తప్పనిసరి అవసరమని తహసీల్దార్ ఫర్వీన్‌షేక్ అన్నారు. హత్నూరలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకట వివేకానంద, పీడీ గణపతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతకు సైన్స్‌ఫేర్ దోహదం

జిల్లావ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ సైన్స్ పరికరాల నమూనాలు, ఆకృతులను ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్స్ ఎంతో దోహదపడతాయని వివిధ మండలాల విద్యాధికారులు వివరించారు. విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్)



న్యాల్‌కల్: శ్రీవాణి విద్యాలయంలో సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



న్యాల్‌కల్: రేజింతల్‌లో సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ మారుతిరాథోడ్



సదాశివపేట: సైన్స్ నమూనాలను ప్రదర్శిస్తున్న శాంతినికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



జహీరాబాద్ టౌన్: సిద్దార్థ హైస్కూల్‌లో సైన్స్‌ఫేర్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బస్వరాజ్



వట్‌పల్లి: సైన్స్ పరికరాలను ప్రదర్శిస్తున్న ఉసిరికపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు



జోగిపేట: బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అడవి రాజు



ఝరాసంగం: జీర్లపల్లి ఉన్నత పాఠశాలలో సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న తహసీల్దార్



రామచంద్రాపురం: రాకెట్ నమూనాను చూపుతున్న తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి

ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు

- కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు అని, కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఖేడ్ మున్సిపాలిటీలో ఇష్టారాజ్యంగా పాలన కొనసాగించారన్నారు. తాము రివ్యూ సమావేశం నిర్వహించడంతో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయన్నారు. దీంతో మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లంతా మార్పును కోరుకున్నారని, అందుకే ఆనంద్ స్వరూప్‌షెట్కార్ చైర్మన్‌గా, దారం శంకర్‌గుప్తా వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. ఇక నుంచి మెరుగైన పాలన అందిస్తామన్నారు. రాష్ట్రం 3లక్షల కోట్ల అప్పులతో ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌గుప్తా, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముంతాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖేడ్ మండలం నమీమేట్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, మాజీ ఉప సర్పంచ్ పండరి, శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ (అర్థశాస్త్రం) శ్రీనివాస్‌కు డాక్టరేట్ వరించించిందని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రపంచ వాణిజ్య సరళీకరణ నేపథ్యంలో-సిరిసిల్లా వస్త్ర పరిశ్రమ సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారని తెలిపారు. సిరిసిల్ల పట్టణం ప్రధాన వస్త్ర పరిశ్రమ కేంద్రంగా 60 ఏళ్ల నుంచి విలసిల్లుతోంది. మరమగ్గాల ఆధునీకరణ లేకపోవడం తదితర కారణాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సామర్థ్యం కోసం విస్తరించలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వస్త్ర పరిశ్రమకు అవసరమైన అవస్థాపన సౌకర్యాలు, పరపతి సమకూర్చడం ద్వారా పరిశ్రమ నాణ్యమైన ఉత్పత్తి చేయడం తన పరిశోధన ద్వారా తెలిపారు. శ్రీనివాస్‌ను బుధవారం అధ్యాపకుల బృందం సన్మానించింది.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

సంక్షేమం, అభివృద్ధికి కృషి

ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల అమలు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పేదలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు లావణ్య, జానాబాయి, నాయకులు వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పల్నాటి భాస్కర్, నరేష్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

జహీరాబాద్ టౌన్: ఆరు గ్యారెంటీలో భాగంగా గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసిన సందర్భంగా మండల పరిధిలోని హోతి(బి)గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు అవినాష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎంపీపీ ఎన్నిక అనూహ్యం

- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ సభ్యులు
- ఎంపీపీగా ఎన్నికైన మొగులప్ప

రాయికోడ్(అందోల్): ఎన్నికల అధికారిణి డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, జహీరాబాద్ ఆర్‌డీఓ రాజు సమక్షంలో బుధవారం ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఎంపీపీగా ఎన్నికైన వెంకట్‌రావు పాటిల్ 2021 ఏప్రిల్ 27న మృతి చెందారు. ఆతర్వాత ఉప ఎన్నిక జరగలేదు. 11 మంది ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. వైస్ ఎంపీపీ మమతను ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సభ్యుడు పండరి ప్రపోజల్ చేశారు. మమతను బలపర్చుతూ కాంగ్రెస్‌కు చెందిన సభ్యులు కృష్ణ, వీణారాణి, శంకరమ్మ బలపర్చారు. అనంతరం బీఆర్‌ఎస్ ఎంపీటీసీ శివకుమార్ పాటిల్ కాంగ్రెస్‌కు చెందిన రాయికోడ్ ఎంపీటీసీ మొగులప్పను ఎంపీపీగా ప్రపోజల్ చేశాడు. మొగులప్పను బలపర్చుతూ బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీ నవనీత, లక్ష్మి, నీరంజన్, సత్తమ్మ చేతులెత్తారు. దీంతో ఐదుగురు సభ్యులు మద్దతు పొందిన మొగులప్పను ఎంపీపీగా ఎన్నికైనట్లు అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మొగులప్పను అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మసూద్ షరీఫ్, కో ఆప్షన్ సభ్యుడు అబేద్‌మియా, సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీగా మొగులప్పను ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారిణి నాగలక్ష్మి

కాంగ్రెస్‌లోనే కొనసాగుతాను

తన సేవలను గుర్తించి తనకు మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ సభ్యులకు ఎంపీపీ మొగులప్ప కృతజ్ఞతలు తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని, పార్టీ మారే ఉద్దేశం లేదని మొగులప్ప అన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

జహీరాబాద్ టౌన్: మండలంలోని తుంకుంట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గౌతంకుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ ప్రభలత, మాజీ సర్పంచ్ రాజు విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీమాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య విద్యార్థులను అభినందించారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం...

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం పోలీనా, ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు.

నిజాంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో..

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పర్యవేక్షించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. నెల్లూరు జిల్లా.. వడ్డెపాలెంకు చెందిన జ్యోతిబాబు(28) బతుకుదెరువు కోసం ఏడాది క్రితం కుటుంబసభ్యులతో కలిసి వచ్చి పటాన్‌చెరు మండలంలోని కర్దనూర్ గ్రామంలో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ పాటి గ్రామానికి బైక్‌పై వెళ్లి చికెన్ తీసుకొని కర్దనూర్‌కు వస్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పటాన్‌చెరు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి సోదరుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుదలతో చదివితేనే విజయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టుదలతో చదివితేనే విజయం సాధ్యమవుతుందని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ గత పదో తరగతి బ్యాచ్‌ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలలకు మంచి పేరు తీసుకువచ్చారని, ఇప్పటి పదో తరగతి విద్యార్థులు కూడా పాఠశాలకు మంచి పేరు తెచ్చేవిధంగా ఫలితాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా మంది విద్యార్థులు ప్రతి ఏడాది ఐఐటీ సీట్లు పొందుతున్నారని తెలిపారు. 2024 బ్యాచ్‌కు చెందిన చాలామంది విద్యార్థులు ఈ ఏడాది కూడా ఐఐటీలో చేరతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మునిపల్లి(అందోల్): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 297 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 303 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 297 మంది పరీక్ష రాయగా వారిలో 6 మంది గైర్హాజరయ్యారు.

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 206మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 117మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాల, కస్తూర్బా కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

కోహీర్(జహీరాబాద్): కోహీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 132 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిఉండగా 130 మంది విద్యార్థులు హాజరయ్యారు.

భుజంగంకు అవార్డు ప్రదానం

మునిపల్లి(అందోల్): అక్షయ పాత్ర ఫౌండేషన్ 15వ వార్షికోత్సవాన్ని సంగారెడ్డిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మేళసంగ్యం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు భుజంగంకు నౌరిష్ ద చేంజర్ అవార్డును సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి రమణ ప్రదానం చేశారు.



భుజంగంకు అవార్డును ప్రదానం చేస్తున్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ

సంక్షిప్త వార్తలు

◆ **నూతన కమిటీ ఎన్నిక**

కోహీర్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బడంపేట గ్రామ శివారులో వెలసిన రాచన్నప్రభు స్వామి ఆలయ జాతర ఉత్సవ కమిటీ సభ్యులను బుధవారం ఎన్నుకున్నారు. సభ్యులుగా దయానంద్ పాటిల్, సరస్వతి, శ్రీపాల్, గోపాల్, అంజయ్య, అశోక్, భీమ్‌సింగ్, ప్రాభాకర్, బస్వరాజ్, నాగేష్, చంద్రప్ప, యాదయ్య, రాజు, మహేశ్వర్ స్వామి ఎన్నికయ్యారు. అనంతరం సభ్యుల నియామకపత్రాన్ని దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప, సిబ్బంది, అర్చక బృందం సభ్యులు పాల్గొన్నారు.

◆ **సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ బదిలీ**

సంగారెడ్డి: ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది. నిమ్జ్ భూసేకరణ అధికారిగా బదిలీ చేస్తూ ఆయన స్థానంలో భూ సేకరణ అధికారి వసంతకుమారిని సంగారెడ్డి ఆర్డీఓగా నియమించారు.

◆ **ఘనంగా మహాపడి పూజ**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని రాళ్లకత్వలో జ్యోతిర్లింగ మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్, అనిల్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ స్వాతి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శివరాజ్, ఆంజనేయులు, రామకృష్ణ పూజల్లో పాల్గొన్నారు.

◆ **ప్రధాని సభకు స్థలం పరిశీలన**

పటాన్‌చెరు: ప్రధాని నరేంద్రమోదీ మార్చి 5వ తేదీన జరగబోయే బహిరంగ సభకు పటాన్‌చెరు శివారు ఎల్లంకి కళాశాల సమీపంలో స్థలాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరామణరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అంజిరెడ్డి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప పాల్గొన్నారు.

◆ **విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామంలో చేపట్టిన మత్స్యశాఖ భవన నిర్మాణానికి ఎల్లమ్మగూడ మాజీ సర్పంచ్ రవీందర్ రూ.లక్ష విరాళాన్ని బుధవారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మహేష్, సంఘం నాయకులు సత్యనారాయ, రాజు, మల్లేశ్, కృష్ణ, భిక్షపతి రవీందర్‌ను ఘనంగా సన్మానించారు.

◆ **పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చూపొద్దని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధుఆదర్శ్ రెడ్డి అన్నారు. వార్డ్ కార్యాలయంలో రాంకీ సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో సంకష్టహర చతుర్థిని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రుద్రారం గణేష్ గడ్డ ఆలయంలో...

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గణేష్‌గడ్డ ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్లు నిర్మిస్తాం**

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని మాజీ ఎంపీపీలు రాజేశ్వర్‌రావు, రాంరెడ్డి తెలిపారు. మండలంలోని ఇబ్రాహీంపూర్, గొర్రెగట్టు, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

◆ **పాఠశాల వార్షికోత్సవం**

మునిపల్లి(అందోల్): మండలంలోని అంతారం జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ శంకర్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ సాబేర్‌అలీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాటు వివాదం.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం

పటాన్‌చెరు టౌన్: తాము కొనుగోలు చేసిన ప్లాట్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఇరువర్గాల మధ్య వాదోపవాదాలతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు కలుగజేసేంతవరకు వెళ్లింది. వివరాల్లోకి వెళితే... పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలోని పార్వతిపురం కాలనీలో పటాన్‌చెరుకు చెందిన నాగమణి, వీరేశంలు 2015లో ప్లాట్ కొనుగోలు చేశారు. అయితే ఈ ప్లాట్‌లో బోరువేసి షెట్టర్లను కూడా నిర్మించి అద్దెకు ఇచ్చారు. కాగా ప్లాట్‌లో షెట్టర్లను తొలగించి ఇళ్లు నిర్మించుకునేందుకు బుధవారం భూమిపూజ చేయడంతో కథ అడ్డం తిరిగింది. సదరు వ్యక్తి ప్లాట్ తమదేనంటూ పటాన్‌చెరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయికాడి విజయ్ రంగంలోకి దిగారు. సర్వే నంబర్ 180లో 13,14 ప్లాట్లను 2013లో కొనుగోలు చేశామని, ప్లాట్ తమదేనని తెలిపారు. కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ కూడా ఉందంటూ తమ వాదనను వినిపించటంతో అక్కడ ఇరువర్గాల మధ్య ప్లాట్ పంచాయితీ తారాస్థాయికి చేరింది. పటాన్‌చెరుకు చెందిన నాగమణి, వీరేశం ప్లాట్‌ను తాము కొనుగోలు చేశామని పదేళ్లుగా ప్లాట్‌లో బోరువేసి షెట్టర్లను నిర్మించినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం చేపట్టే దశలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ రంగంలోకి దిగి తమను ఇబ్బందులకు గురిచేయటం సరికాదని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేయడంతో గొడవ సద్దుమనిగింది.

రోగులకు పండ్లు పంపిణీ

జోగిపేట(అందోల్): అందోల్-జోగిపేట పురపాలక సంఘంలో బుధవారం టైలర్స్ డే ను పురస్కరించుకొని జోగిపేట మేరు సంఘం ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది టైలర్స్ డే సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. చాలామంది మేరు సంఘం సభ్యులు టైలర్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సంఘాన్ని ఏర్పాటు చేసుకొని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్, శ్రీనివాస్, మహేందర్, జోగినాథ్, ప్రభాకర్, శివయ్య, నందు, రెబ్బ శ్రీకాంత్, సంగమేశ్వర్, పవన్‌కుమార్, రాఘవేంద్ర, నర్సింహులు, ఆంజనేయులు, భరత్, శివకుమార్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.